మంత్రి సురేఖ బర్త్‌డే వేడుకల్లో ఏసీపీ

- కార్యకర్తలతో కలిసి సంబురాలు
- అనుచరుల అత్యుత్సాహం.. జనాల మధ్యే పటాకుల మోత
- ఓ బాలిక, ముగ్గురికి గాయాలు
- ఎంజీఎం దవాఖానకు తరలింపు

కాశీబుగ్గ, ఆగస్టు19: అది ప్రధాన రోడ్డు.. ఎటు చూసినా జనసందోహం నడుమ ఎలాంటి అనుమతి లేకుండా మంత్రి బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. ఇందులో స్వయంగా ఓ ఏసీపీ, సీఐ, సిబ్బంది సైతం పాల్గొనడంతో ఇక 'అనుచరులు' అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇష్టం వచ్చినట్టు పటాకులు పేల్చడంతో ఏ సంబంధం లేని నలుగురు బాటసారులు గాయపడ్డారు. గ్రేటర్ వరంగల్‌లోని కాశీబుగ్గ ప్రధాన రోడ్డుపై సోమవారం నిర్వహించిన మంత్రి కొండా సురేఖ బర్త్‌డే వేడుకల్లో ఈ ఘటన జరిగింది. మంత్రి ముఖ్య అనుచరుడు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టగా కార్యకర్తల అత్యుత్సాహం బాటసారుల ప్రాణాలమీదికి తెచ్చింది. వారు పేల్చిన పటాకులతో దారిన వెళ్లే బాలిక హరిణి, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, పోలీసు సిబ్బంది కూడా హాజరై కేక్‌కట్ చేసి వీరెలు పంపిణీ చేయడం చర్చనీయాంశమైంది. అసలే రాఖీ పౌర్ణమి కావడంతో రద్దీగా

హరిణి కాలికి అయిన గాయం

ఉన్న రోడ్డుపై పెద్ద ఎత్తున పటాకులు కాల్చడంతో ఈ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. రోడ్డుపై వెళ్తున్నవారంతా చెల్లాచెదురయ్యారు. వీరిలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఇంజపురి యాదగిరి కూతురు హరిణి తీవ్రంగా గాయపడింది. కాశీబుగ్గ సాగర్ హోటల్ జంక్షన్‌లో ఉండే తన పెద్ద నాన్న కొడుకుకు రాఖీలు కట్టేందుకు వచ్చిన హరిణి గాయాలపాలై రోడ్డు పైనే విలవిల్లాడుతుంటే అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. బాటసారులు, బంధువులే కలిసి బాధితులను ఎంజీఎం వైద్యశాలకు తరలించారు. జంక్షన్ నుంచి కాశీబుగ్గకు వెళ్లే రోడ్డును బ్లాక్ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గంటల కొద్దీ ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. పండుగ రోజు ఇలా రోడ్డు బ్లాక్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఏమిటని స్థానికుల్లో అసహనం వ్యక్తమైంది. ఈ విషయం తెలిసి బాలికకు మెరుగైన వైద్యం అందిస్తామని, నయమయ్యేదాకా ఖర్చులు భరిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

మంత్రి కొండా సురేఖ బర్త్ డే వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రాఖీ కట్టడానికి వెళ్లి వృద్ధురాలి మృతి

చిన్నమ్మ

లక్ష్మణచాంద, ఆగస్టు 19: సోదరుడికి రాఖీ కట్టడానికి వెళ్లి ఓ వృద్ధురాలు మృత్యువాత పడింది. ఈ ఘటన సోమవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వడ్యాల్‌కు చెందిన రాల్లబండి చిన్నమ్మ(70) ఖానాపూర్ మండలం దిల్వార్‌పూర్‌లో ఉంటున్న సోదరుడు రసమల్ల బద్దయ్యకు రాఖీ కట్టడానికి ఆదివారం వెళ్లింది. సోమవారం ఉదయం గ్రామంలోని కాలువ సమీపంలో ప్రమాదవశత్తు కాలుజారి కాలువలో పడిపోయింది. బంధువులు వెతకగా కాలువలో ఆమె మృతదేహం లభించింది. ఆమె కుమారుడు ముత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపారు.

గుండెపోటుతో అన్న మృతి

గుండెలు పగిలేలా రోదించిన అక్కాచెల్లెళ్లు

దశరథ్(ఫైల్)

నర్సాపూర్, ఆగస్ట్19: రాఖీ కడుదామని బయలుదేరిన అక్కాచెల్లెళ్లు సోదరుడి మరణవార్త విని గుండెలవిసేలా రోదించారు. సోమవారం మెదక్ జిల్లా కాగజ్‌మద్దూర్‌లో రాఖీ పండుగ పూట విషాదం నిండింది. గ్రామానికి చెందిన బోగ దశరథ్ (50)కు ముగ్గురు అక్కలు, చెల్లెలు ఉన్నారు. వారు దశరథ్‌కు రాఖీ కడుదామని ఉదయమే బయలుదేరారు. ఇంతలోనే దశరథ్ గుండెపోటుతో మృతి చెందాడని తెలిసి ఆ అక్కాచెల్లెళ్లు గుండెలు పగిలేలా రోదించారు. బీఆర్ఎస్ నర్సాపూర్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు దశరథ్ సోదరుడు.

- గురుకులంలో రాఖీ గోస

గురుకులాల్లో రక్షాబంధన్‌కు సెలవు ఇవ్వలేదు. సోమవారం రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది కర్కశత్వంగా వ్యవహరించారు. తోబుట్టువులతో రాఖీలు కట్టిద్దామని పిల్లలతో కలిసి వచ్చిన తల్లిదండ్రులను సిబ్బంది అనుమతించలేదు. గంటల తరబడి వేచి చూసి కొంతమంది తిరిగి వెళ్లారు. ఇంకొంతమంది కిటికీలోంచి రాఖీ కట్టించుకున్నారు. ప్రిన్సిపాల్ పద్మ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహించారు. చివరకు చేసేదేమీ లేక సిబ్బంది గేటు తీశారు. – సిరిసిల్ల రూరల్

- చెట్లకు రాఖీలు కట్టి.. పర్యావరణ హితం చాటి

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రేమికురాలు బ్లెస్సీ కాగితాలతో సుమారు వంద రాఖీలను తయారు చేసి, రక్షా బంధన్ వేళ చెట్లకు కట్టి తన అనుబంధాన్ని చాటుకున్నది. సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి ప్రకాశ్ కూతురు బ్లెస్సీ ఐదేండ్లుగా చెట్లకు రాఖీలు కడుతుండడాన్ని పలువురు అభినందిస్తున్నారు. –కోనరావుపేట



కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో వైద్య విద్యార్థిని, నర్సింగ్ ఆఫీసర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఈ 'రాఖీ' వైద్య విద్యార్థిని, నర్సింగ్ ఆఫీసర్‌కు అంకితం

పండుగ జరుపుకోని కరీంనగర్ దవాఖాన నర్సింగ్ సూపరింటెండెంట్

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 19: రాఖీ అంటేనే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లకు ప్రేమతో కూడుకున్న పెద్ద పండుగ. తన సోదరులకు రాఖీ కట్టాల్సిన ఆ అధికారిణి ఈరోజు సమాజంలో జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ పండుగ జరుపుకోలేదు. ఆమెది పెద్ద కుటుంబం. చాలా మంది అన్నాదమ్ముళ్లు ఉన్నారు. అయినప్పటికీ రెండు నెలల వ్యవధిలోనే ఒక నర్సింగ్ ఆఫీసర్, ఒక వైద్యురాలిపై అత్యాచార ఘటనలు తనను కలిసి వేసిందని, ఈ రోజు రాఖీ పండుగ జరుపుకోకుండా వారికి అంకితం ఇస్తున్నానని వెల్లడించారు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో నర్సింగ్ సూపరింటెండెంట్(గ్రేడ్-2)గా పనిచేస్తున్న పోగుల శోభ అత్యాచార ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని, నర్సింగ్ ఆఫీసర్ చిత్ర పటాలకు దవాఖానలోని తన చాంబర్‌లో పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ నవీన,డాక్టర్ రవిప్రవీణ్‌రెడ్డి,డాక్టర్ అశోక్, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల, ఏడీ షమీం సిబ్బంది పాల్గొన్నారు.

అప్పట్లో రోజుకు 26 గంటలు!

చైనా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

బీజింగ్, ఆగస్టు 19: రోజుకు ఎన్ని గంటలు అంటే తక్కున 24 గంటలు అని చిన్న పిల్లలు సైతం చెప్పేస్తారు. కానీ, ఒకప్పుడు ఈ లెక్క వేరేలా ఉండేదట. అవును, కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఒక రోజుకు 26 గంటలు ఉండేవట. చైనాలోని చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. భూగ్రహం చరిత్రలోని నిర్దిష్టమైన రెండు కాలాల్లో చంద్రుడు భూమికి దూరం జరిగాడని, ఫలితంగా భూమిపై చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి తగ్గిందని పరిశోధకులు తేల్చారు. చంద్రుడి గురుత్వాకర్షణ భూభ్రమణంపై ప్రభావం చూపుతుందని, ఈ శక్తి తగ్గడం వల్ల భూభ్రమణ వేగం రెండు గంటల మేర పెరిగిందని తెలిపారు. దాదాపు 200 నుంచి 700 మిలియన్ సంవత్సరాల నాటివిగా భావిస్తున్న టైడలైట్స్ అనే రాతిపొరలను అధ్యయనం చేసి ఈ విషయాన్ని గుర్తించినట్టు పరిశోధకులు చెప్పారు. 500 మిలియన్ ఏండ్ల నుంచి 650 మిలియన్ ఏండ్ల మధ్య సంభవించిన కేంబ్రియన్ పేలుడు, 280 మిలియన్ సంవత్సరాల నుంచి 340 మిలియన్ సంవత్సరాల మధ్య జరిగిన మరో పేలుడు వల్లనే రోజు నిడివి పెరిగిందని వీరు పేర్కొన్నారు.

మేఘా కోసం తొండాట

సుంకిశాల ఘటనపై వెలుగులోకి సరికొత్త వాస్తవాలు

- చిన్న సంఘటన కావటంతోనే బయటికి రాలేదన్న మంత్రులు
- ఈ నెల 7న తమ దృష్టికి వచ్చిందని జీవోలో చెప్పిన ప్రభుత్వం
- కానీ, సంఘటన జరిగిన వెంటనే ఖైరతాబాద్ ఆఫీస్‌కు ఫోన్
- అసెంబ్లీ జరుగుతుండగానే జలమండలి అధికారులకు సమాచారం
- నేటిదాకా మేఘా ఇంజినీరింగ్‌పై కించిత్తు చర్యలు తీసుకోని సర్కారు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఎంత దాచాలని ప్రయత్నించినా, కాస్త ఆలస్యమైనా దావానలంలా వ్యాపిస్తుంది. సుంకిశాల ఘటనపై అదే జరిగింది. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే జలమండలి ఉన్నతాధికారుల ఫోన్లు మోగాయి. కిందిస్థాయి ఇంజినీర్లు, ఏజెన్సీకి చెందిన ఇంజినీర్లు కూడా జరిగిన ఘటనను వివరించారు. కానీ ఆ వాస్తవాల్ని అక్కడే జలసమాధి చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు చివరి రోజు జరుగుతున్న సమయంలోనే ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయానికి ఈ సమాచారం వచ్చింది. అయినా.. 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చేవరకు ఎందుకు గోప్యత పాటించారు? బయటికి వచ్చినరోజు జలమండలి ఉన్నతాధికారులు ఇచ్చిన అధికారిక వివరణలోనూ ఎప్పుడు తమ దృష్టికి వచ్చిందనే అంశాన్ని ఎందుకు పొందుపరచలేదు? దీన్ని గోప్యంగా ఉంచడం వల్ల ఎవరికి ప్రయోజనం? ఎవరిని కాపాడే ప్రయత్నం? ప్రస్తుతం ఇంజినీరింగ్ వర్గాల మధ్య జరుగుతున్న చర్చ ఇదే. ఈ నేపథ్యంలో మేఘా ఇంజినీరింగ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం.. ఘటన తర్వాత చోటుచేసుకున్న కొన్ని ఆసక్తికరమైన పరిణామాలు ఇప్పుడు నెమ్మదిగా బయటికొస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తున్నది.

నల్లగొండ జిల్లాలోని సుంకిశాల వద్ద జరుగుతున్న జలమండలి పనుల్లో ఒక్కసారిగా రిటెయినింగ్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలిన ఘటనపై రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తున్నది. దీనిపై ప్రభుత్వం గోప్యత పాటించటంపై పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో అసలు అప్పటి వరకు తమ దృష్టికే రాలేదని ప్రభుత్వమే చేతులెత్తేసిన విషయం తెలిసిందే. కారణాలు ఏవైనా.. సుంకిశాల వద్దే ఆ సమాచారం నిలిచిపోయింది తప్ప బయటికి రాలేదనే రీతిలో అటు మంత్రులు, ఇటు పుర పాలకశాఖ ఉన్నతాధికారులు తమ ప్రకటనల్లో స్పష్టంచేశారు. వాస్తవానికి ప్రమాదం జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయానికి సమాచారం వచ్చినట్టు తాజాగా తెలిసింది. అంతేకాదు.. ఒకవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో జలమండలి ఉన్నతాధికారులకు ఫోన్లలో పూసగుచ్చినట్టుగా ఘటన వివరాలు అందాయని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పాటు 3 రోజుల వ్యవధిలోనే లిఖితపూర్వకంగా కూడా సమాచారం వచ్చింది. అయినా.. విషయం బయటికి పొక్కకుండా శాయశక్తులా ప్రయత్నించారు.

లేఖను తిరస్కరించిన పైఅధికారులు

సుంకిశాల ఘటన జరిగిన సమయంలో సైట్ వద్ద వాస్తవానికి జలమండలి ఇంజినీర్లు లేరు. జలమండలి ఈ నెల 8న ఇచ్చిన వివరణలోనూ ఇదే అంశాన్ని పేర్కొన్నది. కానీ ఘటన జరిగిన వెంటనే మేఘా ఇంజినీరింగ్ సంస్థ ఇంజినీర్లు జలమండలి ఇంజినీర్లకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సుంకిశాల పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే (ఎగ్జిక్యూట్ చేసే) ఇంజినీర్ వెంటనే తన పైఅధికారులకు ఫోన్ చేసిన చెప్పారు. అంతేకాదు.. లిఖితపూర్వకంగా లేఖను ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఆపైఅధికారుల ఆదేశాల మేరకు దాన్ని తిరస్కరించినట్టు ఇంజినీరింగ్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దనే మౌఖిక ఆదేశాలు రావటంతో అందరూ మిన్నకుండిపోయారు. జలమండలి ఉన్నతాధికారులకు ఈ సమాచారం తెలిసినపుడు అసెంబ్లీ బడ్జెట్ సమావేశం కొనసాగుతుండటం గమనార్హం. అయితే క్షేత్రస్థాయి ఇంజినీర్ మాత్రం పైఅధికారులకు చెప్పినా ఎందుకు గోప్యంగా ఉంచాలని అన్నదానిపై అనుమానం కలిగింది. ముమ్ముందు ఇది తనకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న భయంతో ఏం చేయాలనే దానిపై తర్జనభర్జన పడినట్టు తెలిసింది. చివరకు ముందుచూపుతో ఈ నెల 5న (ఘటన జరిగిన మూడు రోజులకు) లిఖితపూర్వకంగా తన పైఅధికారికి స్పీడ్ పోస్టు ద్వారా లేఖ పంపారు. స్పీడ్ పోస్టు కావటంతో అదేరోజు సదరు పైఅధికారికి అది చేరింది. శాఖాపరంగా ఒక ఇంజినీర్ తన పైఇంజినీర్‌కు మాత్రమే (త్రూ ప్రాపర్ చానల్) లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అలా కాదని నేరుగా ఉన్నతాధికారులకు ఇవ్వడానికి వీలుండదు. దీంతో ఆ లేఖను డిప్యూటీ జీఎం స్థాయిలోనే నిలిపివేశారు.

ఆ లేఖలో ఉన్నది ఇదే..

అడిక్‌మెట్ ప్రాజెక్టు డివిజన్-3కి సంబంధించిన జనరల్ మేనేజర్‌కు ఈ నెల 5న వచ్చిన లిఖితపూర్వక నివేదికలో ఆ రోజు ఏం జరిగిందనే వివరాలు స్పష్టంగా ఉన్నాయి. 'ఈ నెల 2న ఉదయం 6.10 గంటలకు బ్లాక్-3, 4లోని ఎక్స్‌పాన్షన్ జాయింట్ వద్ద చిన్న సీపేజీ రావటం మొదలైంది. మేఘా ఇంజినీరింగ్‌కు చెందిన నైట్‌డ్యూటీ సూపర్‌వైజర్ జగదీశ్ దీన్ని గమనించి, వెంటనే అప్రమత్తమయ్యారు. సిబ్బంది, కార్మికులు, యంత్రాలను ఇన్‌టేక్ వెల్ నుంచి బయటికి తీసుకువచ్చారు. సీపేజీ ఒక్కసారిగా ఉధృతమై సొరంగంపై దక్షిణం వైపు రిటెయినింగ్ వాల్‌తో పాటు కౌంటర్ ఫోర్ట్ వాల్‌ను తన్నుకొచ్చి పంపుహౌజ్ జలదిగ్బంధమైంది. సాయంత్రం వరకు ఏ ఒక్కరూ గల్లంతు కాలేదనే సమాచారాన్ని మేఘా ఇంజినీరింగ్‌కు చెందిన ప్రాజెక్టు మేనేజర్ నర్సిరెడ్డితో మాట్లాడి ధ్రువీకరించుకున్నాం. తదుపరి చర్యల కోసం సమాచార నిమిత్తం ఇది పంపుతున్నాం' అని అందులో స్పష్టంగా ఉన్నది.

గోప్యతతో ఎవరికి ప్రయోజనం?

సుంకిశాల ఘటన తర్వాత జలమండలిలో ప్రకంపనలు రేగాయి. ప్రభుత్వం నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేయటంతో పాటు డైరెక్టర్‌ను బదిలీ చేసింది. దీనిపై జలమండలి ఇంజినీరింగ్ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. కిందిస్థాయి వారిని బలి చేస్తారా? అంటూ వాట్సాప్ గ్రూప్‌ల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల వరకు సమాచారం వెళ్లినా కిందిస్థాయి వారిని బాధ్యులు చేయటం ఎంతవరకు సమంజసమని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సస్పెండ్ అయిన ఇంజినీర్ల సంజాయిషీ సంతృప్తికరంగా లేదని ప్రభుత్వం పేర్కొన్నది. మేఘా ఇంజినీరింగ్‌కు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వగా, తామే బాధ్యులమని లిఖితపూర్వకంగా అంగీకరించింది. కానీ ఇప్పటివరకు ఏజెన్సీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఘటన వల్ల మేఘా ఇంజినీరింగ్‌పై ఒక మచ్చ పడింది. రూ.కోట్ల నష్టాన్ని కూడా భరించాల్సి ఉన్నది. కానీ 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకురాకపోతే సదరు ఏజెన్సీపై ఎలాంటి రిమార్కు ఉండేది కాదు. అకస్మాత్తు వరదతో పంపుహౌజ్‌లోకి నీళ్లు వచ్చాయంటూ దాని పునరుద్ధరణకు సర్కారు ఖజానా నుంచి రూ.కోట్ల బిల్లులు దండుకొనేవారు. ఇన్నిరోజులు ఉద్దేశపూర్వకంగా గోప్యత పాటించడం వెనక మేఘా ఇంజినీరింగ్‌ను కాపాడే ప్రయత్నం జరిగినట్టు రూఢీ అయ్యిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డీఎస్సీ పరీక్ష పేపర్ లీక్?

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిన ప్రశ్నపత్రంలో వచ్చిన ప్రశ్నలు.. జూలై 23న నిర్వహించిన రెండో సెషన్‌లోనూ రిపీట్ అయ్యాయి. విచిత్రమేమంటే ప్రశ్న నంబర్ కూడా మారలేదు. రెండు పేపర్లలోనూ ఒకే నంబర్ ఇవ్వడం గమనార్హం. ఇక ప్రశ్నలు అచ్చుగుద్దినట్టుగా ఉండగా, ఆప్షన్లు సైతం ఒకే రకంగా వచ్చాయి. సహజంగా పరీక్షకు ముందే ప్రశ్నలు బయటికొచ్చినా.. పేపర్ బయటికొచ్చినా లీకేజీగా పరిగణిస్తారు. పరీక్ష ప్రారంభమయ్యాక బయటికొస్తే పేపర్ ఔట్‌గా పరిగణిస్తారు. 23న పరీక్ష ప్రారంభానికి ముందే 18 ప్రశ్నలు బయటకు వచ్చాయంటే దీనిని పేపర్ లీకేజీగా పరిగణించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, పోటీ పరీక్షల శిక్షకులు వెంటనే ఆన్‌లైన్‌లో, యూట్యూబ్‌లో కీ పేపర్‌ను ఇచ్చారు. కొన్ని ప్రశ్నలకు అప్పటికప్పుడు సమాధానాలను ఆన్‌లైన్‌లో బయటపెట్టారు. 19న సైతం ఇలాగే పలు ప్రశ్నలకు ఆన్సర్లు బయటపెడితే, వాటిని చూసిన వారు 23న పరీక్షకు హాజరైతే వారికి లాభం చేకూరే అవకాశం ఉన్నదని కొందరు అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది పేపర్ లీకేజీయేనని అభిప్రాయపడుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం!

సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డియే విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన పరీక్షల్లో ఇంత పెద్ద తప్పిదం చోటుచేసుకోవడం సీఎం వైఫల్యమేనని అభివర్ణిస్తున్నారు. గతంలో ఎస్సైస్సీ పరీక్షల సమయంలో పరీక్ష ప్రారంభమైన తర్వాత ప్రశ్నపత్రం బయటకు రాగా అప్పట్లో కాంగ్రెస్ నేతలు పేపర్ లీకు అంటూ హడావుడి చేశారు. ఇప్పుడు 23న వచ్చిన ప్రశ్నలు 19వ తేదీనే బయటికొచ్చాయి. దీనిని పేపర్ లీకేజీగా భావించి డీఎస్సీ పరీక్షలను రద్దు చేయాలని, ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల పాత్రపైనా అనుమానాలు

ప్రశ్నల పునరావృతం వెనుక పెద్ద కుట్ర ఉన్నట్టుగా అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దీని వెనుక కొందరు అధికారుల పాత్ర ఉన్నదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ పరీక్షలను 26 ప్రశ్నపత్రాలను రూపొందించారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ నిపుణులతో కాన్ఫిడెన్షియల్ బృందాన్ని నియమించి రహస్యంగా ప్రశ్నపత్రాలను రూపొందించినట్టు అధికారులు ప్రకటించుకున్నారు. పలు ఆరోపణలు, తప్పిదాలకు కారణమైన, బాధ్యులైన ఎస్సీఈఆర్టీకే డీఎస్సీ ప్రశ్నపత్రాల రూపకల్పన బాధ్యతలు అప్పగించడంలో అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారు.. దర్యాప్తు సంస్థల విచారణ ఎదుర్కొన్న వారికి ప్రశ్నపత్రాల రూపకల్పన బాధ్యతలు ఎలా అప్పగిస్తారని, దీని వెనుక ఏదో గూడుపుఠాని ఉన్నదని, దర్యాప్తు సంస్థలచేత విచారణ జరిపించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

అణచివేతపైనే శ్రద్ధ

డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు నెల రోజులపాటు రోడ్డెక్కారు. టెట్‌కు డీఎస్సీకి మధ్య వ్యవధి తక్కువగా ఉండగా, గ్రూప్-2 పరీక్ష ఆగస్టులోనే ఉండటంతో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించారు. ర్యాలీ నిర్వహించారు. పలువురు మహిళా అభ్యర్థులు కన్నీటిపర్యంతమవుతూ వీడియోలను విడుదల చేశారు. కానీ ఈ ఆందోళనలను లైట్‌గా తీసుకున్న రేవంత్‌సర్కారు తీవ్రంగా అణిచివేసింది.

తప్పిదాల మీద తప్పిదాలు

రేవంత్‌సర్కారు అవగాహన లేమితో చేసిన అనేక తప్పిదాలు వెలుగుచూశాయి. తొలుత టెట్ నిర్వహించకుండా డీఎస్సీ నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేయడం, అభ్యర్థుల ఆందోళనలతో డీఎస్సీ పరీక్షలను వాయిదావేసి, టెట్‌ను నిర్వహించింది. పోటీ పరీక్షల అభ్యర్థుల నుంచి రూపాయి ఫీజుగా తీసుకోబోమని చెప్పి టెట్ పేపర్‌కు 1,000, రెండు పేపర్లకు 2,000 ఫీజుగా తీసుకోగా, తీవ్ర వ్యతిరేకత రావడంతో డీఎస్సీ పరీక్షల దరఖాస్తు సమయంలో ఫీజు లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. ప్రశ్నపత్రాల కూర్పులో వైఫల్యం చెందడం సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది.

జూలై 19న ఎన్టీటీ పేపర్‌లో మొదటి షిఫ్ట్‌లో ప్రశ్నలు

- ప్రశ్న సంఖ్య 111 – పీయూష గ్రంథిచే స్రవించబడే హార్మోన్‌ను గుర్తించండి
- ప్రశ్న సంఖ్య 113– పటంలో గోధుమ/మట్టి రంగు భూ అచ్ఛాదన ఈ భూ వినియోగాన్ని తెలియజేస్తుంది.
- ప్రశ్న సంఖ్య 114 – తెలంగాణలో చాలా ప్రాంతాలు సగటు సముద్ర మట్టానికి ఎగువన దాదాపు ఈ ఎత్తులో ఉంటాయి.
- ప్రశ్న సంఖ్య 115 – ఇచ్చిన ఉష్ణోగ్రతలను (12, 18, 0, -4 మరియు 25 సెల్సియస్ డిగ్రీలను ఆరోహణ క్రమంలో అమర్చగా వచ్చిన సరైన క్రమం.
- ప్రశ్న సంఖ్య 116 – ఎస్కిమోలు మొట్ట మొదట చూసిన యూరోపియన్లు
- ప్రశ్న సంఖ్య 117 – భారతదేశంలోని ఈకింది రాష్ట్రాలను వాటి జనాభా ప్రకారం అవరోహణ క్రమంలో అమర్చండి
- ప్రశ్న సంఖ్య 118 – యూరఫ్ ఖండానికి దక్షిణ సరిహద్దు అయిన కాకేసియన్ పర్వతాలు వీటి మధ్య ఉన్నవి
- ప్రశ్న సంఖ్య 119 – పట్టణ ప్రజల జీవితాలను వివరిస్తూ శూద్రకుడు రచించిన ఆసక్తికరమైన నాటకం.
- ప్రశ్న సంఖ్య 120 – ప్రస్తుతం కుతుబ్‌మినార్ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రసిద్ధ మోఘ్రాలీ ఇనుప స్తంభాన్ని ఏర్పాటుచేసిన వారు
- ప్రశ్న సంఖ్య 121 – ఆఫ్రికాలో కోకోను ఈ దేశంలో ముఖ్యంగా పండిస్తారు.
- ప్రశ్న సంఖ్య 122 – పేపర్ తయారీ ప్రక్రియలో నాలుగో దశ
- ప్రశ్న సంఖ్య 123 – ఈ రాష్ట్రకూట రాజు చాళుక్యుల ప్రభువును తొలగించి 'హిరణ్యగర్భ'అనే సంస్కారవిధిని నిర్వహించాడు.
- ప్రశ్న సంఖ్య 124 – ప్రష్యన్ వ్యాపారి అయిన అబ్దుల్ రజాక్ విజయనగర సామ్రాజ్యాన్ని వీరి కాలంలో సందర్శించాడు.
- ప్రశ్న సంఖ్య 125 – మార్చి 18, 1944న భారత జాతీయ సైన్యం బర్మా సరిహద్దులను దాటి ఈ నినాదంతో భారతదేశంలోకి ప్రవేశించింది.
- ప్రశ్న సంఖ్య 126 – హైదరాబాద్ రాష్ట్రంలోని నిజాం పాలకులు మాట్లాడిన భాష
- ప్రశ్న సంఖ్య 127– భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు మరియు రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్
- ప్రశ్న సంఖ్య 128– ప్రభుత్వ వ్యయాన్ని పర్యవేక్షిస్తూ మరియు నేరుగా భారత రాష్ట్రపతికి నివేదించే స్వతంత్య సంస్థ
- ప్రశ్న సంఖ్య 129 – కింది వారిలో రాజ్యసభ సభ్యులను ఎన్నుకొనువారు.
- ప్రశ్న సంఖ్య 130 – డివిజినల్ స్థాయిలో క్రిమినల్ కేసులు, ఈ కోర్టులలో పరిష్కరించబడతాయి.

జూలై 23న ఎన్టీటీ పేపర్‌లో రెండో షిఫ్ట్‌లో పునరావృతమైన ప్రశ్నలు

- ప్రశ్న సంఖ్య 108 – క్రిందివానిలో పీయూష గ్రంథిచే స్రవించబడే హార్మోన్‌లను గుర్తించండి
- ప్రశ్న సంఖ్య 113 – పటంలో గోధుమ/మట్టి రంగు భూ అచ్ఛాదన ఈ భూ వినియోగాన్ని తెలియజేస్తుంది.
- ప్రశ్న సంఖ్య 114 – తెలంగాణలో చాలా ప్రాంతాలు సగటు సముద్రమట్టానికి ఎగువన దాదాపు ఈ ఎత్తులో ఉంటాయి.
- ప్రశ్న సంఖ్య 115 – ఇచ్చిన ఉష్ణోగ్రతలను (12, 18, 0, -4 మరియు 25 సెల్సియస్ డిగ్రీలను ఆరోహణ క్రమంలో అమర్చగా వచ్చిన సరైన క్రమ